క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి దంపతులు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

బ్రహ్మకుమారీల రక్తదానం



రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్రహ్మకుమారీ అపరంజి పర్యవేక్షణలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో మురళీనగర్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. భారతదేశంతోపాటు నేపాల్‌లో 6 వేల సేవా కేంద్రాల్లో లక్ష యూనిట్ల రక్తం సేకరణలో భాగంగా రక్తదానం చేసినట్లు అపరంజి తెలిపారు. రక్తదానంలో బ్రహ్మకుమారీలతోపాటు మురళీనగర్ వాసులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల సేవలో 'చిన్ముద్ర ట్రస్ట్'

సీతంపేట: అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల ట్రస్ట్ సభ్యుల సమావేశం ఆదివారం శంకరమఠంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రాష్ట్రాలు, జిల్లాల వారీగా ట్రస్ట్ సభ్యుల సమక్షంలో కమిటీల ఏర్పాటు దిశగా ముందుకెళ్లాలని, ట్రస్టు ద్వారా చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. కొన్ని సంస్థలు తెలుగు అయ్యప్ప స్వాములకు చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని తీర్మానించారు. తెలుగు రాష్ట్రాల నుంచి 60 శాతం భక్తులు, అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్తున్నా.. తెలుగు వారికి సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. ఇకపై ఇలాంటి పరిణామాలు ఎదురు కాకుండా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ ప్రభుత్వంతో, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల సహకారంతో అయ్యప్పల రక్షణ, సేవకు అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ముందుంటుందని తెలిపారు. త్వరలో అనంతపురంలో రెండో సమావేశం ఉంటుందన్నారు. ట్రస్టు సభ్యులు పి.ఆది మోహన్‌రెడ్డి, రుద్ర కోటేశ్వరరావు, సిరిసేటి రాజేష్‌గౌడ్, బి.ఈశ్వరయ్య, కర్కా సిద్ధు, బాలు లెంకల, అనంతరావు, వైకుంఠరావు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ 'శంకు' మృతికి సంతాపం

మురళీనగర్: జాతీయ, అంతర్జాతీయ కార్టూనిస్ట్, దూరదర్శన్ డాక్యుమెంటరీలు, ధారావాహికల నిర్మాత, దర్శకుడు శంకు (సంపర భీమ శంకర్‌కుమార్) మృతికి నార్త్ కోస్టల్ ఆంధ్రా కార్టూనిస్టుల ఫోరం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఆదివారం శంకు మరణించారు. ఫోరం సభ్యులు శర్మ, టీఆర్ బాబు, లాల్, ఓంకార్, రఘు, వర్మ, ప్రేమ్, పరిశినాయుడు, కన్నాజీరావు తదితర కార్టూనిస్టులు శంకుకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. శంకు మరణం కార్టూన్ రంగంలో తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అమ్మో.. కొబ్బరి బొండాం

- భారీగా పెరిగిన ధరలు
- ఎండు కొబ్బరి, కొబ్బరి నూనెదీ అదే దారి
- ఆందోళన చెందుతున్న మహిళా భక్తులు



అల్లిపురం మెయిన్‌రోడ్డులో కొబ్బరి కాయలు అమ్ముతున్న వ్యాపారి

అల్లిపురం: కొబ్బరి బొండాలు చలువ చేయడమే కాదు.. మన దేహంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్‌ను ఇట్టే కరిగిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ మధ్య కాలంలో వాకింగ్ గ్రౌండ్లు, ఫిట్‌నెస్ సెంటర్ల వద్ద కొబ్బరి బొండాల దుకాణాలు పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. దీంతో మార్నింగ్ వాక్ పూర్తి చేసుకున్న అనంతరం పట్టణవాసులంతా కొబ్బరి బొండాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అదే విధంగా కొబ్బరికాయల ధర కూడా ఇప్పుడు బాంబులా పేలుతోంది. నియోజకవర్గంలో పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, రామకృష్ణా మార్కెట్, అల్లిపురం, దొండపర్తి మార్కెట్లతో పాటు బహిరంగ మార్కెట్లో కొబ్బరి కాయల ధరలు కొండెక్కాయి. నియోజకవర్గంలో ప్రధాన దేవస్థానాలతో పాటు చిన్నా చితకా గుడులు దాదాపు వందకు పైగానే ఉన్నాయి. ఈ ఆలయాల్లో పూజల కోసం భక్తులు పెద్ద ఎత్తున కొబ్బరికాయలు వినియోగిస్తున్నారు. వాటితో పాటు నీటికాయలు నియోజకవర్గంలో రోజుకు సుమారు 2 వందల నుంచి 250 టన్నుల వరకు అమ్మకాలు జరుగుతున్నట్లు అంచనా. కానీ ఇటీవల లేత కొబ్బరిబొండాలతో పాటు కొబ్బరికాయలు కూడా అధికంగా ఎగుమతి కావటంతో నగరానికి కొబ్బరి దిగుమతులు తగ్గిపోయాయని వ్యాపారులు వాపోతున్నారు. వస్తున్న కాస్త సరుకు అధిక ధరకు అమ్మటంతో అలవాటు పడిన వ్యాపారం కావటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉన్న సరుకు తెచ్చుకోవాల్సి వస్తుందంటున్నారు. కొన్నిసార్లు సరుకు నాణ్యత లేకపోవటంతో వినియోగదారులు తగిన ధర ఇవ్వకపోవటంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని వాపోతున్నారు.

కొబ్బరికాయలదీ అదే దారి..

శ్రావణం, భాద్రపదం, ఆశ్వయుజం, కార్తీకం, మార్గశిర మాసాలు వరుసగా వస్తుండటంతో పూజలు, హోమాలు, శుభకార్యాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో కొబ్బరి కాయల ధరలు భారీగా పెరగటంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఒక్కో కొబ్బరికాయ రూ.15 నుంచి రూ.20 పలికితే, ప్రస్తుతం ఒక్కో కొబ్బరి కాయ రూ. 40 నుండి రూ. 50 వరకు పలుకుతోంది. దీంతో మహిళా భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎండు కొబ్బరి రేట్లు సైతం అమాంతం పెరిగాయి. మూడు నెలల కిందట కిలో ఎండు కొబ్బరి రూ.240 పలికితే ప్రస్తుతం రూ.400 పలుకుతోంది. అరకిలో కొబ్బరి నూనె గతంలో రూ.180 కాగా, ప్రస్తుతం రూ.250 పలుకుతుండటం విశేషం.



అల్లిపురంలో అమ్మకానికి సిద్ధంగా కొబ్బరికాయలు

కొబ్బరి బొండాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి..

డాక్టర్లు కూల్ డ్రింకులు తాగితే ఆరోగ్యం పాడవుతుంది, కొబ్బరి బొండాలు తాగితే ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నారు. సరిగ్గా దీనినే వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మరో వైపు బంగ్లాదేశ్ వంటి దేశాలతో పాటు కోల్‌కతా వంటి మహానగరాల్లో కొబ్బరికాయలకు, బొండాలకు విపరీతమైన గిరాకీ ఉండటంతో రాష్ట్రంలోని కోనసీమ, భీమిలి, విశాఖ జిల్లాలో పలు ప్రాంతాల నుంచి ఎగుమతులు పెరిగిపోతున్నాయి. అక్కడ ఒక్క బొండాం ఖరీదు రూ.100కు పైగా పలుకుతుండటంతో అక్కడి వారు ఆంధ్రప్రదేశ్‌లో పలు తోటల వద్దకు నేరుగా వెళ్లి నాణ్యత గల బొండాలకు అధిక ధర చెల్లిస్తున్నారు. నాణ్యత లేని కొబ్బరి బొండాలను నగరంలోని మార్కెట్లకు తరలిస్తున్నారు.

తెచ్చినవి ఎండబెట్టుకోవాల్సి వస్తోంది



కొబ్బరి బొండాలు హోల్‌సేల్ మార్కెట్‌లోనే కొనలేక పోతున్నాం. ధరలు పెరిగిపోవటంతో బేరాలు కూడా ఉండటం లేదు. సామాన్యులు కొబ్బరి బొండాం కొనుక్కునే పరిస్థితి లేదు. బేరాలు లేక తెచ్చినవి ఎండబెట్టుకోవాల్సి వస్తుంది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– మొల్లేటి రాజు, కొబ్బరికాయల వ్యాపారి

కొబ్బరి నీళ్లు తాగలేకున్నాం



ఒంట్లో బాగులేకపోయినా, వేడి తగ్గాలన్నా కొబ్బరి బొండాం తాగాలంటారు. ఒకప్పుడు రూ.10 నుంచి రూ.30 ఉండేది కనుక కొబ్బరిబొండాం తాగగలిగేవారం. కానీ ప్రస్తుతం చిన్న బొండాం కూడా రూ.50కి అమ్ముతున్నారు. ఒక మోస్తరు బొండాం తాగాలంటే రూ.60 నుంచి రూ.70 ఇచ్చుకోవాలి. ఇప్పుడు కొబ్బరి బొండాం అందుబాటులో లేకుండాపోయింది.

– బి.ప్రసాద్, వినియోగదారుడు

విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలూ అవసరమే



కార్యక్రమానికి హాజరైన మాజీ మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

డాబాగార్డెన్స్: భారత నాట్య కళాంజలి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 11వ వార్షికోత్సవం ఆదివారం సిరిపురం జంక్షన్‌లో ఉన్న గురజాడ కళాక్షేత్రంలో వేడుకగా నిర్వహించారు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ పెద వీరరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరి వెంకటకుమారి మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాట పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ఇనిస్టిట్యూట్ గురువులు సంతోషి, విజయ్ వార్షికోత్సవం నిర్వహిస్తూ విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, రుక్మిణీదేవి ఫైన్ ఆర్ట్స్ కాలేజీ సీనియర్ ప్రొఫెసర్ వసుంధర థామస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మట్టి విగ్రహాల పంపిణీ

అల్లిపురం: ప్రముఖ సంఘ సేవకుడు చందక అప్పలరాజు సోమవారం దండుబజార్ వద్ద 8 గంటల నుండి రాబోయే వినాయక చవితి సందర్భాన్ని పురస్కరించుకుని వారి ఇంటి వద్ద 3 వేల మట్టి వినాయక విగ్రహాలు, గొడుగులు, పాలవెల్లులు పంచనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

చవితి సందడి మొదలు

- నియోజకవర్గంలో వందలాది మండపాల ఏర్పాటు



బౌడారా రోడ్డులో గణనాథుడి రాక కోసం వినూత్నంగా సెట్ వేస్తున్న యువత



దిబ్బలపాలెంలో మండపం ఏర్పాట్లలో నిమగ్నమైన యువత



ఒక్క రోజులోనే రెడీమేడ్ పందిరి

డాబాగార్డెన్స్: వినాయక చవితి పండగంటే పిల్లల నుండి పెద్దల వరకు సందడే సందడి. నెల రోజుల ముందుగానే యువకులు.. స్వచ్ఛంద సంస్థలు వినాయక మండపాల ఏర్పాటుకు సిద్ధపడతారు. పందిరి రాట వేసిన దగ్గరి నుంచి నిమజ్జనం వరకు బిజీబిజీగా గడుపుతారు. నవరాత్రుల్లు అన్నాళ్లు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పందిళ్ల వద్దే కాలం గడుపుతుంటారు. ఇదిలా ఉండగా.. గతంలో పందిరి వేయడానికి అష్టకష్టాలు పడేవారు. వారం, పది రోజుల ముందుగానే ముహూర్తపు రాట వేసేవారు. పెద్ద విగ్రహాలు నిలిపే వారు నెల రోజులు ముందుగానే పందిరి రాట వేసేవారు. అప్పటి నుంచి మండపాల ఏర్పాటు.. డెకరేషన్ కోసం వుడ్ (కర్రలు, బద్దలు) దుకాణాల చుట్టూ తిరిగే వారు. ఆ రోజులు పోయాయి. రెడీమేడ్ పందిళ్లు వచ్చేసాయి. వినాయక చవిత రేపు అనగా ముందు రోజు రాట వేయడం.. ఆ రోజు రాత్రికి రాత్రే మండపాలు (రెడీమేడ్) వెలిసే రోజులు వచ్చేసాయి. దక్షిణ నియోజకవర్గ పరిధిలో సుమారుగా 400 నుంచి 500 వినాయక మండపాలు వెలుస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాల్లో శత శాతం మండపాలు ఆదివారం వరకు వెలియలేదు. అందుకు ప్రధాన కారణం.. రెడీమేడ్ మండపాలే.

నిత్యం బిజీబిజీగా..

నిత్యం బిజీబిజీగా పని ఒత్తిళ్లల్లో ఉండే యువకులకు రెడీమేడ్ మండపాలు వచ్చేయడంతో కొంత ఉపశమనం కలిగినట్టయింది. రెడీమేడ్ మండపాలు వెలుస్తుండడంతో.. ఐరన్ రాడ్స్.. వెల్డింగ్ పనివారికి పని దొరికినట్టయింది. ఫలితంగా వారం పది రోజులుగా రాత్రింబవళ్లు పందిళ్లు వేసుకునే యువకులు, స్వచ్ఛంద సంస్థలకు పనిభారం తగ్గినట్టయింది.

పెరిగిపోయిన ధరలు..

సరుగుడు కర్రలు, బద్దలు (వుడ్)తో వినాయక మండపాలు.. డెకరేషన్ చేస్తుంటారు. వాటి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఒక్కో సరుగుడు కర్రను రూ.300 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. 5 అడుగుల నుంచి 9,10,12 అడుగుల బద్దలను వేలాది రూపాయలతో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్ష



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న అతిథులు



మట్టి విగ్రహాలతో చిన్నారులు

అల్లిపురం: మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్ష అని లయన్స్ క్లబ్ ప్రతినిధి అనకాపల్లి రామారావు అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం అధ్యక్షుడు బీశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం సమాజం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ద్వారకానగర్ అధ్యక్షుడు పీఎస్‌వీ గణేష్, కార్యదర్శి కె. తేజేశ్వరరావు, కోశాధికారి వై.శేఖర్, సుధాకర్, పీజీ ప్రసాదరావు, పి.రవి, రామలింగేశ్వరరావు, సమాజం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలపై విద్యార్థులకు అవగాహన..

డాబాగార్డెన్స్: పర్యావరణాన్ని రక్షిద్దాం.. మట్టి గణపతిని పూజిద్దాం..పేరిట పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రకృతికి హానీ చేసే రంగు బొమ్మలు వద్దు.. మట్టి బొమ్మలే ముద్దంటూ వినాయక మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు, ట్యూషన్ పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న వ్యవస్థాపకురాలు రమాప్రభ

డాబాగార్డెన్స్: వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ 4వ జిల్లా మహాసభ ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఘనంగా నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రమాప్రభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలల్లో విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించే లక్ష్యంతో గత 15 ఏళ్లుగా విశాఖ జిల్లాలో పని చేస్తున్నట్లు తెలిపారు. మహాసభలో క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.హరిత గత 3 ఏళ్లలో ప్రగతి ప్రణాళిక వివరించిన అనంతరం జోన్ల వారీగా చర్చలు జరిగాయి. బాలల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత పెంచడం, సమాజంలో వారి పాత్ర తెలియజేయడం, పిల్లల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించడం వంటి అంశాలు వివరించారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. నూతన జిల్లా నాయకత్వం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ వేలీ ప్రెసిడెంట్ పిల్లలమర్రి రఘు, రోటరీ క్లబ్ డైమండ్ నుంచి ప్రెసిడెంట్ కామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ నీరజ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు దీప, సునీత, ఆసరా చారిటబుల్ సొసైటీ సభ్యులు సంజీవకుమార్, శ్రీనాథ్, ఐద్వా సెక్రటరీ సత్యవతి, ప్రజా నాట్య మండలి కార్యదర్శి చంటి, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎల్‌జే నాయుడు, ఉమామహేశ్వరరావు, వీసీసీ సభ్యులు అలేఖ్య, నిఖిల్, శశి, జోన్ కన్వీనర్లు అప్పారావు, లీలావతి, సంధ్య, సరోజిని, అరుణ, శ్రావణి, భవానీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సుడిలో 38వ వార్డు

- పొంగిపొర్లుతున్న భూగర్భ డ్రైనేజీ
- తాగునీటి జలాలు కలుషితం
- వ్యాధులతో పిల్లలు, పెద్దల సతమతం
- కార్పొరేటర్ ఎక్కడంటున్న స్థానికులు



భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లుతున్న దృశ్యాన్ని చూపుతున్న మహిళలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 38వ వార్డుని ఆ వార్డు కార్పొరేటర్ పట్టించుకున్న పాపాన పోలేదు. వార్డులో ఎక్కడికక్కడ సమస్యలు తిష్ట వేస్తున్నా.. స్పందిచండం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వార్డు పరిధి కంచరవీధిలో గత కొంత కాలంగా భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా వార్డు కార్పొరేటర్ పట్టనట్టు ఉంటున్నారని వాపోతున్నారు. ఇప్పటికే తాగునీటి కలుషితంతో పిల్లలు.. పెద్దలు జ్వరాల బారిన పడతున్నా కనీసం పట్టించుకో లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వార్డులో ఆయా వార్డు కార్పొరేటర్లు.. ప్రజా ప్రతినిధులు పర్యటిస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుంటున్నా.. తమ వార్డు కార్పొరేటర్ వార్డులో పర్యటన పక్కన పెడితే సమస్యలు కూడా పట్టించుకోకపోవడం దారుణమంటూ వాపోతున్నారు. కార్పొరేటర్ ఎలాగూ పట్టించుకోవడం లేదు.. సచివాలయ/కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువవుతోందని సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం




సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి చెక్కు అందజేస్తున్న దాత వెంకటనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరంలోని ఆటోనగర్‌కి చెందిన జి.వెంకటనాయుడు దంపతులు రూ. 2 లక్షల 8 వేల విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కుని పీఆర్‌వో కార్యాలయంలో ప్రోటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహా నరసింహం పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు ప్రసాదం అందజేశారు.

పేద ముస్లింలకు ఉచితంగా వివాహాలు



మాట్లాడుతున్న ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ఆదివారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి, విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి తమ పిల్లలకు తగిన సంబంధాలను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 10 సార్లు ఉచిత వివాహ పరిచయ వేదికలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా ఇప్పటి వరకు సుమారు 400 మంది వివాహాలు చేసుకుని ఒక్కటయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. పేద ముస్లింలకు తమ సొసైటీ తరపున షాదీ ఖర్చులు భరించి, ఉచితంగా వివాహాలు జరిపిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ మీర్ అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి సయ్యద్ అమీర్‌జాన్, సహాయ కార్యదర్శి మహబూబ్ ఆలీ ఖాన్, కోశాధికారి షేక్ అహ్మద్ వలీ, సొసైటీ సభ్యులు మహ్మద్ హబీబ్, రహ్మతుల్లా, మెహబూబ్ షరీఫ్, మొహ్మద్ లుక్మన్, అస్గర్ ఆలీ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో ఆధునిక 3ఆర్‌డీ ఎండోస్కోపిక్‌పై వర్క్‌షాప్

ఎంవీపీకాలనీ: స్థానిక మెడికవర్ ఆస్పత్రిలో ఆదివారం ఆధునిక 3ఆర్‌డీ ఎండోస్కోపిక్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం, విశాఖపట్నం ఘాట్ క్లబ్, ఐఎంఏ విశాఖ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నిష్టల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా 3ఆర్‌డీ ఎండోస్కోపిక్ విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంపై యువ డాక్టర్లు అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మెడికవర్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న థెరప్యూటిక్, విస్తృత శ్రేణి ఎండోస్కోపీ, అల్ట్రాసౌండ్, థెరప్యూటిక్ ఈఆర్‌సీపీ, కోలోనోస్కోపీ, పాంక్రియాటికోస్కోపిక్ ద్వారా రోగులకు అందిస్తున్న ఆధునిక చికిత్స విధానాలను వివరించారు. అనంతరం వైద్యులు ఎండోస్కోపీ థెరపీ చికిత్స విధానంలో వారి అనుభవాలు, నూతన చిట్కాలను పంచుకున్నారు. పూణే, విశాఖతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది వైద్య అధ్యాపకులు హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ శివ, డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ గిరిధర్, డాక్టర్ వాణి, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ రాధిక చావన్, మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.